క్లుప్తంగా

ఆదమరిస్తే అంతే..



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో బోధన్-బాన్సువాడ ప్రధాన రహదారిపై నస్రుల్లాబాద్ బస్టాండ్ వద్ద రోడ్డు గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. ఈ ప్రదేశంలో నిత్యం వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం బైక్‌పై నుంచి ఓ కుటుంబం కిందపడటంలో తీవ్ర గాయాలయ్యాయి. నిత్యం రాష్ట్ర నాయకులు, పాలకులు, జిల్లా స్థాయి అధికారులు ఇదే దారిలో ప్రయాణిస్తూ ఉంటారు. కాని ఎవరూ పట్టించుకోవట్లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పిచ్చిమొక్కల మధ్య విద్యుత్ తీగలు



బాన్సువాడ రూరల్ : ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యానికి బోర్లం-బోర్లం క్యాంప్ రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభం, తీగలు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయి. విద్యుత్ స్తంభంతో పాటు విద్యుత్‌వైర్ల చుట్టూ పిచ్చిమొక్కల తీగలు అల్లుకున్నాయి. అటువైపు అధికారులు ఇప్పటికైనా స్పందించి విద్యుత్ స్తంభాలకు, వైర్లకు అల్లుకున్న తీగలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మహనీయుల జయంతి ఉత్సవం



బాన్సువాడ : బాన్సువాడ ఎస్సీ బాలికల వసతి గృహంలో ఆదివారం ఏఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహనీయుల జయంతోత్సవం నిర్వహించారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావ్‌పూలే, బాబాసాహెబ్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాంల మహనీయులను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహం వార్డెన్ గంగాసుధ, ఏఎస్ఆర్ ఫౌండేషన్ శ్రీదేవి, సాయికుమార్ ఉన్నారు.

ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్ గెలుచుకోవాలి



రాజంపేట : మండల కార్యకర్తలు అందరు సమష్టిగా కష్టపడి జహీరాబాద్ కాంగ్రెస్ ఎం పీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను గెలిపించుకోవాలని మండల అధ్యక్షులు యాదవరెడ్డి అన్నారు. ఆదివారం రాజంపేట లోని స్థానిక గంగ పుత్ర సంఘ భవనంలో కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. సీనియర్ నాయకులు వీరన్న పటేల్, టౌన్ అధ్యక్షులు బెస్తచంద్ర, మండల యువజన అధ్యక్షుడు క్రిష్ణారావు, కిసాన్ సెల్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి తదితరులున్నారు.

వాహనాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో ఆదివారం పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. పెండింగ్ చలాన్లను వసూలు చేశారు. ఏఎస్సై సంజీవులు, కానిస్టేబులు, హోంగార్డులు పాల్గొన్నారు.

ఘనంగా మహావీర్ జయంతి



కామారెడ్డి టౌన్ : జైన్ గురువు మహవీర్ జయంతి పురస్కరించుకుని జైన్ యువ మంచ్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటంతో జిల్లా కేంద్రంలో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. మహిళలు, యువత భక్తులు డీజే పాటలతో నృత్యాలు చేసుకుంటూ ర్యాలీగా తరలివెళ్లారు. స్టేషన్ రోడ్‌లోని ఆలయంలో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు కమల్‌చంద్, దిలిప్ చంద్రబోహ్రా, మహేష్, రోషన్, రాహుల్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెకు పాకిన బెట్టింగ్ మాఫియా

- జోరుగా ఐపీఎల్ దందా
- మోసపోతున్న విద్యార్థులు, యువత



రామారెడ్డి(ఎల్లారెడ్డి) : యువత ఐపీఎల్ బెట్టింతో వలలో చిక్కి తీవ్రంగా నష్టపోతున్నారు. ముఖ్యంగా పల్లెలకు సైతం ఈ విషసంస్కృతి చేరడంతో అమాయక యువకులు, విద్యార్థులు ఆర్థికంగా నష్టపోయి ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబాల్లో ఐపీఎల్ చిచ్చు పెడుతోందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రామారెడ్డి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు ఇంట్లో తెలియకుండా రూ.50 వేలు, స్నేహితుల దగ్గర తన బుల్లెట్ బైకును తనఖా పెట్టి అప్పు తెచ్చి బెట్టింగ్‌లో పెట్టి చేతులు కాల్చుకున్నాడు. కాగా వడ్డీకి తీసుకొచ్చిన డబ్బులు కట్టాలని సదరు యువకుడిపై ఒత్తిడి తీసుకురాగా, ఆ యువకుడి తండ్రి మిత్తితో సహా కట్టినట్లు సమాచారం. ఇదే మండలంలో ఓ తండాలో కూడా ఇలాంటి పరిస్థితి నెలకొంది. అంటే ఐపీఎల్ బెట్టింగ్ వెర్రి గ్రామాలు, తండాలు పట్టణం అన్న తేడాలేకుండా అంతటా సాగుతోంది.

అంతా స్మార్ట్‌ఫోన్లలోనే..

గతంలో బెట్టింగ్‌లు వేయాలంటే బుకీలంతా ఒక కేంద్రంగా స్థావరం ఎంచుకుని గుట్టుగా నిర్వహించేవారు. ఆ స్థావర సమాచారం పోలీసులకు అందితే వారిని సులభంగా పట్టుకునేవారు. ప్రస్తుతం బెట్టింగ్ దందా మొత్తం స్మార్ట్‌ఫోన్లలోనే జరుగుతోంది. ఐపీఎల్ మ్యాచ్ ప్రారంభంలో బుకీల ఫోన్లు వస్తాయి. ముందుగా వారు సూచించిన అకౌంట్లలో డబ్బులు జమ చేయాలి. తర్వాత పోటీ పడుతున్న రెండు జట్లు బలాబలాల ప్రకారం బెట్టింగ్ ఉంటుంది. బలమైన జట్టుతో, బలహీనమైన జట్టు పోటీలో ఉంటే బలహీనమైన జట్టుపై గెలుస్తున్నారని బెట్టింగ్ కాస్తే ఒకటికి రెండు, మూడు రెట్లు కూడా డబ్బులు చెల్లిస్తారు. మ్యాచ్ జరుగుతున్నంతసేపు బెట్టింగ్‌ను జట్లలో ఏ వైపుకైనా మార్చుకునే అవకాశం ఉంటుంది. ఇలా క్షణక్షణానికి మారే పరిస్థితిని యువత తప్పుగా ఆడుతూ తమ ఒల్లు గుల్ల చేసుకుంటున్నారు.

పోలీస్ వ్యవస్థకు సవాల్..

అయితే ఇంత జరుగుతున్నా నిఘా వ్యవస్థ నిద్రపోతుందా అంటే ఫోన్ ద్వారా జరిగే బెట్టింగ్‌ను నిరోధించడం పోలీస్ వ్యవస్థకు సవాల్‌గా మారింది. నిఘా వ్యవస్థకు అంతు చిక్కడం లేదు. పట్టణంలో గ్రామాలలో,తండాల్లో ఏం జరుగుతుందో కనిపెట్టలేకపోతున్నారు. తెలిసీతెలియని విద్యార్థులు యువత, షాపుల్లో పనిచేస్తున్న యువకులు, విద్యార్థులు కూడా ఐపీఎల్ బెట్టింగ్‌లో పాల్గొంటూ నష్టాల బాట పడుతున్నారు. గతంలో కామారెడ్డి జిల్లాలోనే రహస్యంగా రూంలలోల్లో జరిగేవి. ఇప్పుడు పల్లెల్లో వేగంగా పాకింది.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించండి



చిట్యాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : రాబోయే ఎంపీ ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ అన్నారు. తాడ్వాయి మండలంలోని చిట్యాల గ్రామంలో ఆదివారం ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలిస్తే గ్రామాలు మరింత గెలిచినట్లయితే ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అన్నిరంగాలలో మరింత అభివృద్ధి చేసుకోవచ్చని పేర్కొన్నారు. బీబీపాటిల్ పదేళ్లు చేసిందేమీ లేదన్నారు. ఈ సందర్భంగా మాజీసర్పంచ్ మ్యాడం కవిత, మరికొంత మంది కాంగ్రెస్‌పార్టీలో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు అకిల్‌రావు, నాయకులు మహేందర్‌రెడ్డి, షౌకత్‌అలీ తదితరులున్నారు.

లింగంపేటలో..

లింగంపేట(ఎల్లారెడ్డి) : ఆదివారం మండలంలోని పొల్కంపేట, కన్నాపూర్, కోమట్‌పల్లి, పోతాయిపల్లి, లింగంపేట గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేశ్ షెట్కర్‌కు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటేసి శెట్కర్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, అశోక్, ఇబ్రహిం, భాస్కర్‌గౌడ్, ఫతియోద్దీన్, జొన్నల రాజు తదితరులున్నారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతోపాటు చందాపూర్, కరడ్‌పల్లి, ఎండ్రియాల్, నందివాడ, ఎర్రాపహాడ్, సంతాయిపేట్, క్రిష్ణాజివాడి, దేవాయిపల్లి తదితర గ్రామాలలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, అఖిల్, షౌకత్, భూషణం, సంజీవులు, అశ్వక్, రాజేశ్వర్‌రెడ్డి తదితరులున్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



కుర్తిలో ప్రచారం చేస్తున్న నాయకులు

పిట్లం(జుక్కల్): మండలంలోని కుర్తి, సిద్దాపూర్, బ్రహ్మణపల్లి తదితర గ్రామాలలో బీజేపీ నాయకులు ఆదివారం ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు.బీజేపీ పార్టీనాయకులు అశోక్‌రాజ్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పార్టీకు ఓటు వేసి ఎంపీగా బీబీ పాటిల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కొరారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు అభినయ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వడ్ల శివ, నాయకులు పాల్గొన్నారు.

బాన్సువాడ : బాన్సువాడలో ఆదివారం బీజేపీ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపి అభ్యర్థి బీబీ పాటిల్‌ను గెలిపించాలని సూచించారు. అవినీతికి అడ్డాగా ఉన్న బీఆర్ఎస్, కాంగ్రెస్‌ను ఓడించాలని బీజేపీ నాయకులు ఓటర్లకు సూచించారు. ఎంపీగా బీబీ పాటిల్ పదేళ్లలో జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ, సేవ కార్యక్రమాలను వివరించారు. బీజేపీ నాయకులు దావుగారి డాకయ్య, రాజాసింగ్, శంకర్‌గౌడ్, గుడుగుట్ల శ్రీనివాస్, అశ్వీన్, సాయిబాబా, రాజు తదితరులు ఉన్నారు.

స్నేహితుడికి చేయూత



రాజంపేట : రాజంపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన కడెం స్వామి కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. దీంతో కడెం స్వామి స్నేహితులు (2005- 06బ్యాచ్) ఆదివారం తమ వంతు సహాయంగా రూ. 22,500 ఆర్థిక సాయాన్ని అందజేశారు.

యంత్రాలతో పంట నూర్పిళ్లు



నిజాంసాగర్(జుక్కల్) : నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల్లో వరి పంట నూర్పిళ్లు జోరుగా సాగుతున్నాయి. నిజాంసాగర్ ప్రాజెక్ట్‌తో పాటు చెరువులు, కుంటలు, వ్యవసాయ బోరుబావుల వద్ద పండించిన వరి పంటలు కోతకు రావడంతో పంట నూర్పిడీ పనుల్లో రైతులు బిజీబిజీగా ఉన్నారు. ఒక్కొక్క ఎకరం పొలాన్ని నూర్పిడికి గంటకు రూ. 2,600 చెల్లిస్తూ పంట నూర్పిడీలకు యంత్రాలను ఉపయోగిస్తున్నారు. గ్రామాల్లోకి యంత్రాలు అందుబాటులోకి రావడంతో వ్యవసాయ కూలీ పనులు జోరందుకున్నాయి.

ప్రమాదకరంగా చదలవాగు ఇరుకు కల్వర్టు



బాన్సువాడ రూరల్ : నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే బాన్సువాడ-ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై కొయ్యగుట్ట సమీపంలోని చదలవాగు కల్వర్టు ప్రమాదకరంగా మారింది. దశాబ్దాల క్రితం నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరింది. రోడ్డు విస్తరించిన అధికారులు కల్వర్ట్‌ను విస్తరించకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. భారీ వాహనాల రాకపోకల సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. అధికారులు స్పందించి కల్వర్టును విస్తరించి వంతెన నిర్మించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

ఆధ్యాత్మికం

అభయాంజనేయ స్వామి క్షేత్రంలో వార్షికోత్సవం




నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని మాగి గ్రామ అభయాంజనేయ స్వామి క్షేత్రంలో ఆదివారం ద్వితీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంజనేయ స్వామి ఆలయంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య శివ పార్వతుల కల్యాణం వైభవోపేతంగా జరిపారు. అంజనేయస్వామి వార్షికోత్సవాలకు వచ్చిన భక్తులకు ఆలయ వ్యవస్థాపకుడు మేంగారం శ్రీనివాస్ కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు జయప్రదీప్, ప్రజా పండరి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆలయ జీర్ణోద్ధరణ ఉత్సవాలు



భిక్కనూరు : మండలంలోని తిప్పాపూర్ గ్రామంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరాలయం ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమం ఉత్సవాలను ఈనెల 22 సోమవారం నుంచి 24 బుధవారం వరకు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తాటిపల్లి సిద్దరాములు, ప్రతినిధులు ఆదివారం తెలిపారు. 22వ తేదీ సోమవారం విష్వక్సేన ఆరాధన తదితర కార్యక్రమాలు, 23వ తేదీ మంగళవారం యాగశాల ప్రవేశం, మండపారాధన, ఆదివాస హోమం, తీర్థప్రసాద వితరణ, 24వ తేదీ బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, అంజనేయ గరుడ విగ్రహ ప్రతిష్ఠ పూర్ణాహుతి, తదనంతరం, శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవము, అన్నదానం ఉంటుందన్నారు.

ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో నడవాలి



పిట్లం(జుక్కల్) : మండలంలోని కారేగాం గ్రామంలో గత వారం నుంచి అఖండ హరినామ సప్తహ కార్యక్రమం కొనసాగుతుంది. శనివారం రాత్రి సప్తహ కార్యక్రమంలో పాల్గొన్న కీర్తనకార్ మహారాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలన్నారు. భక్త తుకారం మహారాజ్ సూచించిన మంచి మార్గంలో ప్రయాణించాలని భక్తులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన



బాన్సువాడ : పట్టణంలోని తాడ్కోల్ శివారులోని డబుల్ బెడ్ రూం కాలనీలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో ఆదివారం హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు అన్నదానం చేశారు. విగ్రహ ప్రతిష్ఠాపనకు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, నాయకులు అంజిరెడ్డి, ఎజాస్, హనుమాన్ దీక్ష స్వాములు తదితరులు ఉన్నారు.

ఘనంగా సీతారాముల రథోత్సవం



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని అడ్లూర్ గ్రామంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారు జామున సీతారామ చంద్ర స్వామి వారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా స్వామివారి పల్లకీ సేవ గరుడసేవ తదితర పూజలు చేశారు. సాయంత్రం చక్కెర తీర్థం, జాతర నిర్వహించారు.

హనుమాన్ శోభాయాత్రకు ఏర్పాట్లు పూర్తి




ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలో మంగళవారం నిర్వహించే హనుమాన్ శోభాయాత్రకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు బజరంగ్‌దల్ నాయకులు ఆదివారం తెలిపారు. పట్టణంలోని పప్పు హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించిన అనంతరం సాయంత్రం 4 గంటలకు హనుమాన్ శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు. భక్తులు శోభాయాత్రను విజయవంతం చేయాలన్నారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని మైలారంలో కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి కొబ్బరి కాయలు కొట్టి, నైవేద్యాలు సమర్పించి భక్తితో మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా పెద్దమ్మ ఆలయ తిరుగు బోనాలు



దోమకొండ : మండల కేంద్రంలో పెద్దమ్మ ఆలయ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తిరుగు బోనాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి మహిళలు ఒడిబియ్యం సమర్పించారు. ఉదయం నుండి ప్రత్యేకంగా పూజలను చేశారు. అనంతరం తిరుగు బోనాలు డప్పు చప్పుల మధ్య ఇళ్లకు తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పున్న లక్ష్మణ్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహమ్మద్ నగర్‌లో..



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని హసన్‌పల్లి గ్రామంలో ఆదివారం పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పెద్దమ్మ తల్లికి గ్రామస్తులు బోనాలతో ఊరేగింపు ర్యాలీగా తరలివచ్చారు. అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కులస్థులు హరినాథ్, హరీన్, సాయిరాం తదితరులు ఉన్నారు.

శివపార్వతుల కల్యాణోత్సవం

రామారెడ్డి : సీతారాముల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శివపార్వతుల కల్యాణోత్సవం మండల కేంద్రం రామారెడ్డిలో వైభవంగా వేదమంత్రాల మధ్య నిర్వహించారు. స్వామివారికి తలంబరాలు, వేద పండితులు సత్యాలు చేస్తూ దండలు సమర్పించి, శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు.

కొనసాగుతున్న రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు



రాజంపేట : రాజంపేట మండల కేంద్రంలో రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గౌడ సంఘ మహిళలు నల్లపోచమ్మ దేవతలకు బోనాలను ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించారు. అనంతరం రేణుకాదేవిని డప్పు చప్పులతో, డీజే సౌండ్‌తో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు.

కోనాపూర్‌లో విగ్రహ ప్రతిష్ఠాపన



బాన్సువాడ రూరల్ : మండలంలోని కోనాపూర్ గ్రామంలో పునర్నిర్మించిన రుక్మిణి విఠలేశ్వర స్వామీ శివపంచాయతన మహా సరస్వతి విగ్రహ, శిఖర ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆదివారం అత్యంత వైభంగా నిర్వహించారు. ఈనెల 18న ప్రారంభమైన కార్యక్రమం ఆదివారం స్థాపిత దేవతామూర్తుల ప్రాణప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠాపనతో ముగిసింది. హైదరాబాద్‌కు చెందిన వేదపండితులు గోవిందుగారి ప్రణీత్‌శర్మ బృందంతో పాటు గ్రామ పురోహితులు జోషి కిషన్‌రావు, మాజీ సర్పంచ్ వెంకటరమణరావుల ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. గ్రామస్తులతో పాటు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరయ్యారు. గ్రామానికి చెందిన రత్కంటి పరివారం ఆధ్వర్యంలో 4రోజుల పాటు మహా అన్నదానం చేపట్టగా, సద్గురు శ్రీ మాణిక్ ప్రభు భజనమండలి ఆధ్వర్యంలో భజన నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో సప్తాహం

మండలంలోని నాగారం గ్రామంతో పాటు కాద్లాపూర్ హనుమాన్ మందిరం వద్ద, కోనాపూర్ గ్రామంలోని శ్రీరుక్మిణీ విఠలేశ్వర మందిరంలో సప్తాహం కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని 3 గ్రామాల్లో సప్తాహంను ప్రారంభించారు. మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలకు చెందిన వార్కారి భక్తులు ఆలపిస్తున్న భజన సంకీర్తనలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సోమవారం సప్తాహం ముగియనుంది.

గంగిశెట్టి హనుమాన్ ఆలయంలో..



మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రంలోని ద్వాదశ జ్యోతిర్లింగ గంగిశెట్టి హనుమాన్ ఆలయంలో ఆదివారం శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయం, నవగ్రహ ఆలయంలో ఏర్పాటు చేసే నవగ్రహాల విగ్రహాలకు, నూతన శిఖరానికి పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయంపై శిఖర స్థాపన వైభవంగా నిర్వహించారు. సోమవారం మహారుద్రయాగం, మంగళవారం పూర్ణాహుతి, అన్నప్రసాదం నిర్వహిస్తామన్నారు.

సంక్షిప్తం

24న మండల సమాఖ్య సమావేశం

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఈనెల 24వ తేదీన మండల సమాఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఐకేపీ ఏపీఎం రవీందర్ తెలిపారు. ఉదయం 10గంటలకు మండల సమాఖ్య అధ్యక్షురాలు యశోద బాయి అధ్యక్షతన ఈ సమావేశం ప్రారంభమవుతుందని సూచించారు.

నేడు ఎల్లారెడ్డిలో రథోత్సవం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి పట్టణంలో సోమవారం రాత్రి రథోత్సవం నిర్వహించనున్నట్లు రామాలయం కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలతో సోమవారం రాత్రి రామాలయం నుంచి రథోత్సవం ప్రారంభమవుతుందన్నారు.

అంబేడ్కర్ వర్సిటీలో చదివి మేధావులయ్యారు..



కామారెడ్డి అర్బన్ : అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం ద్వారా డిగ్రీ పట్టాలు పొంది ఎంతో మంది ప్రయోజకులయ్యారని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం కామారెడ్డి అభ్యాసక కేంద్రం సమన్వయకర్త ఈ.రాజ్‌కుమార్ అన్నారు. అభ్యాసక కేంద్రం డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థుల పరిచయ కార్యక్రమం ఆదివారం స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగింది. సమన్వయకర్త ఈ.రాజ్‌కుమార్ కార్యక్రమానికి అధ్యక్షతన వహించి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం పుస్తకాలు వివిధ పోటీ పరీక్షలకు ప్రామాణికంగా ఉన్నాయని కార్యక్రమంలో మాట్లాడిన అధ్యాపకులు అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.రామస్వామి, శంకర్‌ప్రసాద్, జే.రాంప్రసాద్, అనిల్‌కుమార్, లక్ష్మణ్, కార్యాలయ బాధ్యులు ఎల్.బాపురావు తదితరులు పాల్గొన్నారు.

'సమైక్యతను పెంపొందించే రచనలు చేయాలి'



కామారెడ్డి అర్బన్ : ప్రజాస్వామిక లౌకిక రాజ్యాంగ విలువలను రక్షించే క్రమంలో కవులు, రచయితలు తమ రచనలు అందించాలని తెలంగాణ రచయితల వేదిక (తెరవే) జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల గఫూర్‌శిక్షక్ అన్నారు. హైదరాబాద్ బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం ఆధ్వర్యంలో 12 విభాగాలుగా నిర్వహించిన సాహిత్య కార్యక్రమంలో తెరవే కామారెడ్డి జిల్లా తరపున గఫూర్ శిక్షక్ పాల్గొని కవితా గానం చేశారు. సమైక్యతను పెంపొందించే రచనలు చేయాలని గఫూర్ శిక్షక్ పిలువు నిచ్చారు.

సోషల్ మీడియా పార్లమెంట్ కోకన్వీనర్‌గా అజయ్



మద్నూర్(జుక్కల్) : జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ సోషల్ మీడియా కోకన్వీనర్‌గా మద్నూర్‌కు చెందిన తమ్మేవార్ అజయ్ నియమాకమయ్యాడు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జుక్కల్ నియోజికవర్గ కమిటీ సభ్యులుగా రాత్‌వార్ శ్రీపద్, శ్రీరామ్‌ను నియమించినట్లు ఆయన అన్నారు.